
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శుక్రవారం 10 అక్టోబరు 2025



సర్పంచ్‌గా పోటీ చేస్తే బాండ్ పేపర్ రాసి ఇవ్వాలి

నంగునూరు యువత వినూత్న డిమాండ్

సోషల్ మీడియాలో వైరల్

7

సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించిన

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారుపై నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు, సదాశివపేట బ్లాక్ ప్రెసిడెంట్ రామ్‌రెడ్డి, సంగారెడ్డి బ్లాక్ ప్రెసిడెంట్ రఘుగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మండల అధ్యక్షులతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సోమవారం కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్ వేసేలా చూడాలని తెలిపారు ఆదివారం వెంకటేశ్వర గార్డెన్స్ మల్కాపూర్‌లో కార్యకర్తలు సమావేశంలో ఎంపీటీసీ జడ్పీటీసీ అభ్యర్థులను ప్రకటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలని అన్నారు.



సంగారెడ్డి నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమైన జగ్గారెడ్డి

యువతకు ఉపాధి కోసం ఏటీసీలు

- కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువతకు ఉపాధి అందించేందుకే అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాల(ఏటీసీ)ను ప్రారంభించి కొత్త కోర్సులను తీసుకు వచ్చామని కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, ఏటీసీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. జీవితంలో ఎవరిమీద ఆధారపడకుండా ఉండాలంటే ఈ ఐటీఐ, ఏటీసీ కేంద్రాలు ఒక మంచి వేదిక కావాలని విద్యార్థులకు సూచించారు. అన్ని కోర్సుల శిక్షణ తరగతులు విద్యార్థులకు సరైన పద్ధతిలో ఇవ్వాలని, ప్రతీ విద్యార్థికి ఉపాధి అందాలని ఆదేశించారు. ఆయా శాఖల సహకారంతో అనుకున్న విధంగా అడ్మిషన్‌లు వచ్చాయని తెలిపారు. శిక్షణ సైతం అంతే నిబద్ధతతో అందించాలని సూచించారు. విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పించాలని, ఉదయం నేర్చుకున్నది సాయంత్రం మూల్యాంకనం చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు రోజువారి ప్రణాళికను డైరీలో రాసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏటీసీలో కావాల్సిన సామగ్రి, మౌలిక వసతులు, స్టాఫ్ గురించి అన్ని వివరాలను అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. కోర్సు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు వస్తాయని, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఏటీసీ ఒక మంచి వేదికని విద్యార్థులకు సూచించారు. ఇంజనీరింగ్ చదువుకునే వారికి కూడా ఇన్ని అధునాతన వసతులు లేవని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మంచి క్రమశిక్షణతో తరగతులకు హాజరై భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా విద్యార్థులకు బస్సు సౌకర్యం అందించడంతో పాటు రిక్వెస్ట్ బస్‌స్టాప్ కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామానుజం తదితర సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కె.హైమావతి

వందకు వేయి.. వేయికి పదివేలు

- డిస్కౌంట్ ఆఫర్ పేరిట బురిడీ



చేర్యాలలో లాటరీ నిర్వహిస్తున్న వ్యక్తి

చేర్యాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దీపావళి డిస్కౌంట్ ఆఫర్ పేరిట ప్రజలను బురిడీ కొట్టించి మోసపుచ్చేందుకు యత్నించిన ఓ వ్యక్తిని స్థానికులు పోలీసులకు పట్టించిన సంఘటన గురువారం చేర్యాలలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన నవీన్ కొంతకాలంగా అమాయక ప్రజల ఆశలను ఆసరా చేసుకుని చిటీలు వేసి లక్కీ లాటరీ పేరిట నకిలీ ఎలక్ట్రానిక్ వస్తువులను అంటగడుతుండటంతో పాటు రూ.100కు రూ.1000, రూ.1,000కి రూ.10,000 వస్తాయని నమ్మబలికిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం చేర్యాల పట్టణానికి వచ్చి జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి పక్కన ఎలక్ట్రానిక్ వస్తుసామగ్రి డబ్బాలు పెట్టి లక్కీ లాటరీ అంటూ ప్రచారం చేయసాగాడు. దీంతో ఆకర్షితులైన పలువురు చిటీలు తీయగా, ఒకరిద్దరికి డబ్బు వచ్చాయి. తరువాత ఎవరికి రాకపోవడంతో మోసం చేస్తున్నాడని గుర్తించారు. విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలపడంతో ఘటనా స్థలానికి చేరుకుని నవీన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ విషయమై ఎస్ఐ నవీన్‌ను వివరణ కోరగా, అతడి వద్ద ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు లభ్యంకాలేదని, ఖాళీ డబ్బాలను డిస్‌ప్లేగా పెట్టాడని, రూ.1100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సంగ్రామం.. విరామం

స్థానిక ఎన్నికలకు బ్రేక్

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- హైకోర్టు తీర్పు వచ్చేదాకా హడావిడి
- నోటిఫికేషన్ విడుదలైన కాసేపటికే స్టే

స్థానిక సంస్థల ఎన్నికలు ఊరించి ఊసురుమనిపించాయి. రిజర్వేషన్లపై హైకోర్టు నాలుగు వారాల గడువు విధించింది. దీంతో గురువారం ఉదయమే విడుదలైన నోటిఫికేషన్‌కు ఇదే రోజు సాయంత్రం బ్రేక్ పడినట్లయ్యింది. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆయా జిల్లాల అధికారులు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికల బృందాలను నియమించారు. అధికారులు చేసిన హడావిడితో ఆశావహులు సైతం ఎన్నికలపై ఆశలు పెట్టుకున్నారు. నామినేషన్లు వేయడానికి తర్జనభర్జన పడ్డారు. ఇంకా రెండు రోజుల సమయం ఉండడంతో నామినేషన్ పత్రాలను మాత్రమే తీసుకెళ్లారు. చివరకు ఆశలు అడియాశలయ్యాయి.

సిద్దిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సంగారెడ్డి జిల్లాలో తొలి విడతగా 12 జడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలు, మెదక్ జిల్లాలో 10 జడ్పీటీసీ, 99 ఎంపీటీసీ స్థానాలు, సిద్దిపేట జిల్లాలో 15 జడ్పీటీసీ, 125 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువరించారు. దీంతో అన్ని మండల పరిషత్ కార్యాలయాల వద్ద గురువారం సందడి నెలకొంది. రిటర్నింగ్ అధికారులు ఆసీనులై నామినేషన్ పత్రాలను అందజేయడం, స్వీకరించడంలో నిమగ్నమయ్యారు.

10 నామినేషన్లే దాఖలు

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ఎంపీటీసీ స్థానానికి తుపాకుల మురళి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా చిన్నకోడూరు మండల జడ్పీటీసీ స్థానానికి బంక చిరంజీవి, అంకార్ మధు, పల్లె రాజు, అరకాల శ్రీకాంత్, నారాయణరావుపేట జడ్పీటీసీ స్థానానికి బర్మ రాంచంద్రం, గౌటి స్వామి, నిరుగొండ దేవయ్యలు నామినేషన్ సమర్పించారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి జడ్పీటీసీ అభ్యర్థిగా అంబటి శ్రీకాంత్‌రెడ్డి, బోర్గి ఎంపీటీసీ స్థానానికి చంద్రవ్వ నామినేషన్ వేశారు. మెదక్ జిల్లాలో ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 37 జడ్పీటీసీ స్థానాలు, సుమారు 350 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైనా తొలిరోజు నామినేషన్ వేసేందుకు ఎవరూ సాహసించలేదు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో చాలామంది తర్జనభర్జన పడ్డారు. రిజర్వేషన్లపై ఎటూ తేలకపోవడంతో ముందుగా నామినేషన్లు వేసి

మిగతా 7వ పేజీలో





కొమురవెల్లి ఏంపీడీవో కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

కొమురవెల్లి/చేర్యాల/మిరుదొడ్డి/తొగుట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు తీర్పుపై నాయకుల్లో, ప్రజల్లో ఉత్కంఠ నెలకొనగా అధికారులు మాత్రం తొలివిడత నామినేషన్ల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. కొమురవెల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను గురువారం ఉదయం ఎన్నికల అధికారి, కలెక్టర్ హైమావతి పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో నామినేషన్ పత్రాల స్వీకరణ ఏర్పాట్లను అనదపు కలెక్టర్ గరీమా అగర్వాల్, మిరుదొడ్డిలో ఆర్డీవో సదానందం పరిశీలించారు. జిల్లా సాధారణ పరిశీలకుడు కె.చంద్రశేఖర్‌రెడ్డి, జడ్పీ సీఈవో రమేశ్, డీఆర్డీవో జయదేవ్ ఆర్యతో కలిసి చేర్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. తొగుట ఎంపీడీవో కార్యాలయాన్ని ఎన్నికల అధికారులతో కలిసి గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింహులు సందర్శించారు.



ప్రపంచ పోస్టల్ డే ర్యాలీ

ప్రపంచ తపాలా దినోత్సవం సందర్భంగా గురువారం సిద్దిపేటలో పోస్టల్ అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సిద్దిపేట పోస్టాఫీస్ నుంచి మోడ్రన్ బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. 'బాలిక పేరున పొదుపు.. భవిష్యత్‌కు మలుపు', 'పోస్టాఫీసులో బీమా.. మీ జీవితానికి ధీమా' అంటూ స్లోగన్స్ ఇస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టుమాస్టర్ కరుణాకర్ రెడ్డి కోరారు. పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను వివరించారు.

- సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)





మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలేవి?

తుక్కాపూర్ శివారులో రోడ్డుపై రైతులు ఆరబోసిన మొక్కజొన్నలు

- ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఖరారు
- కేంద్రాలు ప్రారంభించకపోవడంతో దళారులకు విక్రయం
- రూ.1900కే అమ్ముకుంటున్న రైతులు

తొగుట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టం చేసి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అధికారులు సకాలంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు పండించిన పంటను రైతులు అమ్ముకునే పరిస్థితి నెలకొంది. దాంతో ప్రభుత్వ మద్దతు ధర దక్కక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్, గజ్వేల్, తొగుట, రాయపోల్, చిన్నకోడూర్, కోహెడ, నంగునూరు, వర్గల్, మర్కుక్, బెజ్జంకి, అక్కన్నపేట, సిద్దిపేట రూరల్, అర్బన్, అక్బర్‌పేట భూంపల్లి తదితర మండలాల్లో 28,643 ఎకరాల్లో ఈ ఖరీఫ్‌లో రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారు. మొక్కజొన్నలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2400గా నిర్ణయించింది. కానీ పంట చేతికంది 20 రోజులు కావస్తున్న ఇంతవరకు జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించక పోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుల అవసరాలను ఆసరా చేసుకున్న దళారులు క్వింటాలుకు రూ.1900 నుంచి 1960 వరకు ధర చెల్లించి మొక్కజొన్నలను కొనుగోలు చేస్తున్నారు. దాంతో ప్రభుత్వ మద్దతు ధర దక్కక క్వింటాల్‌కు సుమారు రూ.440 నుంచి 500 చొప్పున తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం తమ పంటకు సరిపడా యూరియా అందించక పోవడంతో దిగుబడిరాలేదని, ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక మమ్మల్ని నట్టేట ముంచుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి న్యాయం చేయలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలే

మొక్కజొన్నల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నుండి ఇంతవరకు ఆదేశాలు రాలేదు. రెండు మూడు రోజుల్లో వస్తాయని అనుకుంటున్నాం. వచ్చిన తర్వాత కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం.

- క్రాంతి, మార్క్‌ఫెడ్ డీఎం

గుంతలమయంగా రోడ్లు 8

తొగుట దారులు అధ్వానం

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పట్టించుకోని అధికారులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిద్దిపేటను మొదటి స్థానంలో నిలుపుదాం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ 8

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు 6

'సీఎం ఫోర్స్' పేరిట వసూళ్ల దందా!


సిద్దిపేటలో నిర్మాణంలో ఉన్న భవన యజమానులకు ఫోన్‌కాల్స్

- డబ్బు ఇవ్వకుంటే అనుమతులు రద్దు చేయిస్తానని బెదిరింపులు

సిద్దిపేట అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలంటే యజమానులు భయపడే పరిస్థితి దాపురించింది. మున్సిపల్ నుంచి అన్ని అనుమతులు పొంది భవనాలు నిర్మిస్తున్నా, కొందరు బెదిరింపులకు పాల్పడుతూ వసూళ్ల పర్వానికి తెర లేపారు. తమకు డబ్బు ఇవ్వకుంటే ఇంటి నిర్మాణం పూర్తి చేయలేరంటూ హెచ్చరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు.

ట్రూకాలర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫోర్స్

ఈ బెదిరింపులు గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త పోకడలు పోతున్నాయి. కొందరు వ్యక్తులు తమ ఫోన్ నంబర్‌కు ట్రూకాలర్‌లో 'సీఎం రేవంత్‌రెడ్డి ఫోర్స్' పేరిట పేరు క్రియేట్ చేసి, ఆ నంబర్ నుంచి భవన యజమానులకు కాల్ చేస్తున్నారు. పెద్ద భవనం నిర్మిస్తున్నందుకు తమకు భారీ మొత్తంలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే అనుమతులు రద్దు చేయిస్తామని, తమదే ప్రభుత్వమని హెచ్చరిస్తున్నారు. ఈ వసూళ్ల కోసం సిద్దిపేటలో జరుగుతున్న నిర్మాణాల వివరాలు, యజమానుల ఫోన్ నంబర్లను సేకరించేందుకు ఇద్దరు, ముగ్గురిని అసిస్టెంట్లుగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. భవన యజమానులు డబ్బు ఇవ్వడానికి నిరాకరిస్తే, వెంటనే అసిస్టెంట్లను పంపి మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదులు సైతం చేయిస్తున్నారు.



136 SIDDIPET CONGRESS

ఇది సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ తరఫున తుది హెచ్చరిక.

కొంతమంది కాంగ్రెస్ నాయకులు అమాయక ప్రజల నుండి డబ్బులు ఇళ్ళ నిర్మాణం పేరుతో వసూలు చేస్తున్నారని గమనించాం. కొంతమంది వ్యక్తులు "Revanth Reddy Force" అనే పేరుతో Truecaller లో కనిపిస్తున్నారు. ఇది పూర్తిగా పార్టీ విలువలకు విరుద్ధమైన చర్య.

ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే, కొంతమంది సీనియర్ నాయకులు కూడా ఈ తప్పు పనులను ప్రోత్సహిస్తూ, ప్రజలకు కాల్ చేసి డబ్బులు అడుగుతున్నారట. మరి

సిద్దిపేట కాంగ్రెస్ పేరిట ఉన్న వాట్సాప్ గ్రూపులో వసూళ్లను ఆపాలంటూ మెసేజ్

వాట్సాప్ గ్రూపుల్లో..

ఈ వసూళ్ల పర్వంపై కింది స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ విలువలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వం ప్రతిష్ఠను దిగజారుస్తున్నారని వాట్సప్ గ్రూపుల్లో చర్చలు పెడుతున్నారు. ఈ వసూళ్లకు పాల్పడుతున్నవారు ఇప్పటికైనా తమ పద్ధతిని మార్చుకోకపోతే, నియోజకవర్గ ఇన్‌చార్జీ, రాష్ట్ర అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం పట్టివేత

వెల్దుర్తి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి టాస్క్ ఫోర్స్ సిబ్బంది, వెల్దుర్తి పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అలాగే శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలో మరో ప్రాంతం నుంచి తీసుకువచ్చిన రేషన్ బియ్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అశోక్ లేలాండ్‌లో ఉన్న 52 బస్తాల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే శ్రీగణేష్ ట్రేడింగ్ కంపెనీలోని ఓ గదిలో నిల్వ ఉంచిన 36 సంచుల రేషన్ బియ్యంను సీజ్ చేశారు.



మంజీర నదిలో దూకిన వ్యక్తి గల్లంతు

- కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది
- శివంపేటవాసిగా గుర్తింపు

పుల్కల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మంజీర నది ప్రవాహంలో దూకిన మరొకరు గల్లంతైన సంఘటన సంగారెడ్డి జిల్లా పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, ఎస్ఐ విశ్వజన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన బుడ్డోల్ల మల్లేశం(40) వివాహం ఎనిమిదేళ్ల క్రితం జరిగింది. కుటుంబ కలహాలతో భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఒంటరిగా జీవనం వెళ్లదీస్తున్నాడు. వారం రోజులుగా రెండవ వివాహం జరిపించాలంటూ తన సోదరుడు బుడ్డోల్ల మొగులయ్య, ఇతర స్నేహితుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీపావళి తర్వాత వివాహం జరిపించే విషయం ఆలోచిస్తామని చెప్పినా వినకుండా మొండికేశాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయిన మల్లేశం, రాత్రి 7.30 గంటలకు శివంపేట వంతెన వద్దకు చేరుకుని మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ అటు ఇటు తిరుగుతూ గ్రామస్థుల కంట పడ్డాడు. సంగారెడ్డి నుంచి శివంపేట వైపునకు వచ్చే కొత్త వంతెన వద్దకు వెళ్లి తన చెప్పులు, మొబైల్ ఫోన్, చేతి రుమాలు (కర్చీఫ్)ను వంతెనపై ఉంచి మంజీర నది ప్రవాహంలో దూకగా గల్లంతయ్యాడు. భార్య పుట్టింటికి వెళ్లిపోవడం, మరో వివాహం చేయాలని పట్టుబట్టడం కారణంగా జీవితంపై విరక్తి చెంది మంజీర నది ప్రవాహంలో దూకి ఉంటాడని మల్లేశం సోదరుడు బుడ్డోల్ల మొగులయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎస్. విశ్వజన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మల్లేశం (ఫైల్)

నెలన్నర వ్యవధిలో ముగ్గురు..

సుమారు నెలన్నర వ్యవధిలో శివంపేట మంజీర నది ప్రవాహంలో ముగ్గురు వ్యక్తులు దూకి గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆగస్టు 29వ తేదీన శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లేశంగౌడ్ గల్లంతు కాగా, మృతదేహం లభ్యమైంది. సెప్టెంబరు 30న జోగిపేటకు చెందిన యూట్యూబర్ అల్లె లోకచంద్ర ఇదే నీటి ప్రవాహంలో దూకి గల్లంతై ఇప్పటికీ ఆచూకీ లభించలేదు.

రూ.1.34కోట్ల విలువైన గంజాయి దహనం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని వివిధ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 26 కేసులలో సీజ్ చేసిన 143.9 కిలోల ఎండు గంజాయిని, 623 గంజాయి మొక్కలను పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దహనం చేశారు. దహనం చేసిన గంజాయి విలువ దాదాపు రూ.1.34కోట్ల వరకు ఉంటుందని ఎక్సైజ్ సంగారెడ్డి స్టేషన్ అధికారి ఎండీ నజీర్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


గంజాయిని దహనానికి సిద్ధం చేస్తున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

జగదేవ్‌పూర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. గురువారం జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో మహిళ హత్య కేసు వివరాలను ఆయన వెల్లడించారు. జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన ఆలేటి యాదవ రెడ్డికి ఇద్దరు కుమార్తెలు ఉండగా, చిన్న కూతురు అపర్ణ తన ఇంటి సమీపంలో ఉండే అబ్బాస్ అనే వ్యక్తిని ప్రేమించింది. పెళ్లికి అపర్ణ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో జనవరిలో ప్రేమ వివాహం చేసుకున్నట్లు తెలిపారు. అబ్బాస్, అపర్ణ జనగాం, ఆ తర్వాత కుకునూరుపల్లిలో కొద్ది రోజులు నివాసం ఉన్నారు. మూడు నెలల క్రితం అపర్ణ, అబ్బాస్‌ల మధ్య గొడవలు రావడంతో అపర్ణ తన తండ్రి యాదవ రెడ్డి ఇంటికి వచ్చింది. తిరిగి అబ్బాస్ దగ్గరికి వెళ్దామనే ఆలోచనతో అపర్ణ, అబ్బాస్‌ను తనను తీసుకొని వెళ్లమని కోరగా, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అబ్బాస్ తన కారు తీసుకొని అపర్ణ ఇంటికి వచ్చి ఆమెను తనతోపాటు తీసుకొని వెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన యాదవరెడ్డి, అతని భార్య నిర్మల, యాదవరెడ్డి తమ్ముడు రాంరెడ్డి ఒక ఇనుప రాడ్ తీసుకొని వారి ఇంటికి సమీపంలోనే ఉండే అబ్బాస్ ఇంటికి వెళ్లి, అతని తల్లి అయిన సాహీం బేగంను ఇనుపరాడుతో తలపై కొట్టడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే వెళ్లి ఆమెను ఆసుపత్రికి తరలించగా, మార్గమధ్యలో మరణించింది. అనంతరం మృతురాలి కొడుకు అబ్బాస్ ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి హత్యకు ఉపయోగించిన ఇనుప రాడు, కర్ర స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






పవన్‌ను తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ పాండు

చిక్కిన బాలుడి ఆచూకీ

- బంధువులే తీసుకెళ్లారు..
- తల్లికి అప్పగించిన పోలీసులు

జోగిపేట రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అందోల్ మండల పరిధి తాడ్మనూర్ గ్రామంలో కలకలం రేపిన బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. మనవడిపై ప్రేమ, అతన్ని చూడాలన్న తాతా బాబురావు కోరిక తీర్చాలని బంధువులే బాలుడిని తీసుకెళ్లారు. ఎస్ఐ పాండు కథనం ప్రకారం.. రాయికోడ్‌కు చెందిన పద్మ, కర్ణాటకలోని భగ్దార్‌కు చెందిన అర్జున్‌కు నలుగురు ఆడపిల్లలు, ఒక బాబు పవన్ ఉన్నారు. అర్జున్ తన బావమరిది అయిన తాడ్మనూర్‌కు చెందిన మరాఠా రాజు(పద్మ పెద్దనాన్న కుమారుడు)తో కలిసి అందోల్ మండల పరిధిలో కొన్ని రోజులు ఎడ్ల వ్యాపారం చేశాడు. ఎడ్ల కొనుగోలు వ్యవహారంలో రూ. 6 లక్షలతో అర్జున్ పరారయ్యాడు. ఈ డబ్బుల కోసం బాధితులు మరాఠా రాజును వేధించడం మొదలు పెట్టారు. దీంతో రాజు.. కర్ణాటకకు వెళ్లగా ఆచూకీ లభించలేదు. చెల్లెలు, ఆమె పిల్లలను తీసుకువస్తే అర్జున్ వస్తాడని భావించి వారిని తాడ్మనూర్‌కు తీసుకువచ్చాడు. కొన్ని రోజులకు పద్మ పుట్టింటికి వెళ్లి వస్తానని చెప్పి, పవన్‌ను అక్కడే ఉంచి నలుగురు ఆడపిల్లలతో వెళ్లింది. అయితే, కిడ్నాప్‌కు గురైన పవన్‌ను చూడాలని ఉందని అతని తాతా బాబురావు తన కుమార్తె కొడుకులు సునీల్, రవిలకు చెప్పుకున్నాడు. దీంతో ఎలాగైనా మనవడిని తాతవద్దకు చేర్చాలని భావించిన వారు బుధవారం గ్రామానికి వచ్చారు. బాలుడు ఆడుకుంటున్న సమయంలో పవన్‌ను తమ ద్విచక్ర వాహనంపై కర్ణాటక తీసుకెళ్లారు. దీంతో మరాఠా రాజు జోగిపేట పోలీసులను ఆశ్రయించాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన ఎస్ఐ పాండు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా, బాలుడిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లినట్లు తేలింది. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కర్ణాటక వెళ్లినట్లు తెలుసుకుని పోలీసులు అక్కడికి వెళ్లి బాలుడిని క్షేమంగా తీసుకువచ్చి, తల్లికి అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసి తీసుకెళ్లిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ తండ్రి కన్నుమూత

- మాజీ సీఎం కేసీఆర్ సంతాపం


విజ్జయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు


చిన్నకోడూరు/హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరు మండలం గంగాపూర్‌లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య (85) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విజ్జయ్య మృతిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సంతాపం ప్రకటించారు. విజ్జయ్య మృతి తనను కలచి వేసిందని, ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢసానుభూతి తెలిపారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విజ్జయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు ప్రతాప్‌రెడ్డి, బాల్‌రాజు, దేవి ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాణిక్య రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రముఖ పురోహితులు, అవధాని శ్రీనాథశర్మ కన్నుమూత

కొమురవెల్లి, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని ప్రముఖ గురుసాంద్రానంద ఆశ్రమం నిర్వాహకులు, ప్రముఖ పురోహితులు, అవధాని, కవి, సాహితీవేత్త, గురుసాంద్రానంద స్వామిజీ రెండో కుమారుడు అయిన గౌరీభట్ల శ్రీనాథ శర్మ(74) గురువారం సాయంత్రం అనారోగ్యంతో ఆశ్రమంలో కన్నుమూశారు. శ్రీనాథ శర్మ ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆయన పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేశారు. శ్రీనాథ శర్మ మృతితో గ్రామస్థులు, ఆశ్రమ భక్తులు తీవ్ర బాధలో మునిగిపోయారు.


గౌరిభట్ల శ్రీనాథశర్మ (ఫైల్)







బొలెరోను ఢీ కొట్టిన డీసీఎం

- డ్రైవర్‌కు స్వల్ప గాయాలు
- టమాటాలు ఎత్తుకెళ్లిన స్థానికులు

కంది, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కంది మండల కేంద్రంలోని కంది-శంకర్‌పల్లి హైవేలో టమాటాల లోడ్‌తో జహీరాబాద్ వైపుకు వెళ్తున్న బొలెరో వాహనాన్ని ఆర్టీఏ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారుజామున ఓ డీసీఎం అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కకు పడిపోయింది. ఈ ఘటనలో బొలెరో డ్రైవర్ బీదర్‌కు చెందిన మనోజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బొలెరోలో ఉన్న టమాటాలు చెల్లాచెదురుగా రోడ్డుపక్కన పడగా, స్థానికులు వాటిని సంచుల్లో, డబ్బాల్లో నింపుకుని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపారు.


టమాటాలు తీసుకెళ్తున్న స్థానికులు

ఎన్నికల్లో పోటీ చేస్తే బాండ్ పేపర్ రాసి ఇవ్వాలి

● నంగునూరు యువత వినూత్న డిమాండ్
● సోషల్ మీడియాలో వైరల్



నంగునూరు యువత ప్రింట్ చేసిన బాండు పేపర్

నంగునూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజలకు సేవ చేస్తానని బాండ్ పేపర్ రాసి ఇస్తేనే తమ ఓటు వేస్తామని నంగునూరు యువత ప్రకటించింది. ఈ మేరకు వారు రూపొందించిన బాండ్ పేపర్ గురువారం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గ్రామ సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్నారా? అయితే మీరు ఈ బాండ్ పేపర్‌పై సంతకం చేసి, మీ నామినేషన్లు దాఖలు చేయండి అంటూ నంగునూరు మండల యువత రూపొందించిన వంద రూపాయల బాండ్ పేపర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాను గెలిచిన తర్వాత అక్రమ ఆస్తులు సంపాదించనని, పదవి ముగిసిన తర్వాత ఆస్తులు పెరిగితే వాటిని గ్రామానికే అప్పగిస్తానని, గ్రామ పంచాయతీ పనుల కోసం ప్రజల వద్ద డబ్బులు అడగనని, తప్పుడు లెక్కలు చూపనని, గ్రామ అభివృద్ధికి ఒక సేవకుడిగా పనిచేస్తాననే షరతులతో కూడిన ఈ బాండ్ పేపర్‌ను తయారు చేసి సోషల్ మీడియాలో పెట్టడంతో ఇది వైరల్‌గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నంగునూరు మండల యువత రూపొందించిన ఈ వినూత్న డిమాండ్ చర్చనీయాంశమైంది. సర్పంచ్‌గా పోటీ చేసేవారు ఈ బాండ్ పేపర్‌ను ఆదర్శంగా తీసుకుంటారా.. లేక కొట్టిపారేస్తారా అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

'పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి'


సమావేశమైన పెన్షనర్లు

సిద్దిపేట క్రైం, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు చిల్ల నరసింహులు అధ్యక్షతన గురువారం సిద్దిపేటలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి జోగు భిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్చి 2024 తర్వాత పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ బెనిఫిట్లు ఇంకా లభించకపోవడం, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుకాకపోవడం, హెల్త్‌కార్డులు పనిచేయక వైద్య సేవలకు ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డీఏల అమలులో జాప్యం వంటి సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, పెన్షనర్ల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించే డైరెక్టర్‌ను నియమించాలని, 20 ఏళ్ల సేవ అనంతరం పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ పూర్తి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పి. అన్నమరెడ్డి, నారాయణరెడ్డి, సత్తయ్య, బన్సీలాల్, ఇంద్రసేనారెడ్డి, నాగేందర్, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, పరశురాములు, బాల నరసయ్య, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో 'ఆస్కీ' బృందం తనిఖీ

● ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కోసం ఆరా


జోగిపేట ఆస్పత్రిలో ఆస్కీ బృందం

జోగిపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జోగిపేటలోని ఏరియా ఆస్పత్రిలో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కీ)కి చెందిన వైద్యుల బృందం గురువారం తనిఖీలు నిర్వహించింది. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, సదుపాయాలు, చికిత్సల గురించి ఆరా తీసింది. ఆస్పత్రి ఆవరణను పరిశీలించిన వారు.. అక్కడ ఏర్పాటు చేసిన పచ్చిక బయళ్లు, మొక్కల పెంపకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో, ఆవరణలోనూ పరిశుభ్రత బాగుందని అభినందించారు. 24 గంటలూ అందుబాటులో ఉన్న ల్యాబ్ సేవలు, ఫార్మసీ విభాగం పనితీరుపై కూడా అభినందించారు. డాక్యుమెంటేషన్ కూడా సమగ్రంగా ఉందని ప్రశంసించారు. ప్రతి 30 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశం మేరకు, ఇక్కడి ఆస్పత్రిలో సెంటర్ ఏర్పాటుకు ఉన్న స్థలం, వసతుల గురించి కూడా ఆస్కి బృంద సభ్యులు ఆరా తీశారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు సరిపడినంత స్థలం ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. అవసరమైన సదుపాయాల గురించి పరిశీలించి నివేదిక తయారు చేశారు. వారి వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, ఆర్ఎంవో డాక్టర్ అశోక్, స్టాఫ్ నర్సులు సునంద, పుల్లమాంబ, యూడీసీ రమేశ్, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సు శ్రీవాణి ఉన్నారు.

కథల పోటీల్లో శనిగరం విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎంఈవోలు

కోహెడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేటలో సుగుణ సాహితీ సమితి నిర్వహించిన బాలల కథల పోటీలలో కోహెడ మండలం శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9 వ తరగతి విద్యార్థిని నేరెళ్ల శ్రీహర్షిత తృతీయ బహుమతి గెలుచుకుంది. గురువారం పాఠశాలలో విద్యార్థినికి ప్రశంసా పత్రం అందించడంతో పాటు, శిక్షణ ఇచ్చిన తెలుగు భాషా ఉపాధ్యాయులు రచ్చ జగదీశ్వర్‌ను అభినందించారు. 'స్నేహమే బహుమతి' అనే కథకు జిల్లా స్థాయిలో శ్రీహర్షిత తృతీయ బహుమతికి ఎంపికైంది. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య విద్యార్థినిని శాలువాతో సత్కరించి, మెమొంటో, నగదు బహుమతిని అందజేశారు. అలాగే పలు గ్రంథాలయ పుస్తకాలను విద్యార్థికి ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్ట సంపత్ కుమార్ రెడ్డి, మండల విద్యాధికారులు యాదవరెడ్డి, ఆర్ పద్మయ్య, హెచ్ఎం ఎం సరళ, కన్వీనర్ దుర్గయ్య, రాజు పాల్గొన్నారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

● విచారణ చేపట్టిన డీఎస్పీ

శివ్వంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పాంబండ గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన జానకి 30 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేసి నివాసముంటుంది. ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో నిర్మాణం చేపట్టింది. ఇదే గ్రామానికి చెందిన దశరథ, మల్లయ్య, భూమయ్య కుటుంబసభ్యులు ధరణి పాస్ పుస్తకంలో భూమి తమ పేరు ఉందని జానకి చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో గొడ్డలితో ఆమెపై దాడికి ప్రయత్నించి, కులంపేరుతో దూషించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు రోజుల క్రితం పోలీసులు ఎనిమిది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, ఎస్సై మధుకర్‌రెడ్డితో కలిసి గురువారం గ్రామానికి వచ్చి విచారణ జరిపారు.

జహీరాబాద్

పారిశ్రామిక కారిడార్‌గా వెలుగు
నిమ్జ్, స్మార్ట్ సిటీ సహా పలు పరిశ్రమలు
పెరగనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
ఆకాశాన్నంటిన భూముల ధరలు


హుగ్గెల్లి నుంచి నిమ్జ్ వరకు వేసిన బీటీరోడ్డు



జహీరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ నియోజకవర్గం పారిశ్రామిక కారిడార్‌గా(ఇండస్ట్రియల్ హబ్) మారబోతోంది. ఈ ప్రాంతంలోని ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్, జహీరాబాద్ ప్రాంతాల్లో పలు పరిశ్రమలు ఏర్పాటు అవుతుండంతో ఉపాధిలో కీలకంగా మారనుంది. ఇప్పటికే జహీరాబాద్ ప్రాంతంలో మహీంద్రా అండ్ మహీంద్రా, దాని అనుబంధ కర్మాగారాలు, నికోలాస్, హట్సాన్ తదితర పరిశ్రమలు ఏర్పాటు అయ్యాయి. దీనికి తోడుగా నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో సుమారు 17వేల ఎకరాల్లో వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో నిమ్జ్ కోసం భూ సేకరణ జరుగుతోంది. ఇందులో ఇప్పటికే టీఎస్ఐఐసీ 511 ఎకరాలు, వెమ్ టెక్నాలజీకి 408 ఎకరాలను కేటాయించారు. ఇక హైదరాబాద్-నాగ్‌పూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా నియోజకవర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని ఏర్పాటు చేయనున్నారు. న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్, మల్గి, వడ్డీ తదితర గ్రామాల్లో ఫార్మాసిటీ ఏర్పాటుకు, కోహీర్-మునిపల్లి మండలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. పరిశ్రమలతో పాటు రవాణా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వికారాబాద్ నుంచి పర్లీ వరకు 273 కిలో మీటర్ల కొత్త రైల్వేలైన్, అదే జిల్లా తాండూరు నుంచి జహీరాబాద్‌కు 75 కిలోమీటర్ల కొత్త రైల్వేలైన్ వేయనున్నారు. నియోజకవర్గంలో వివిధ పరిశ్రమల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు పెరిగిపోయాయి. ఈ ప్రాంతంలో ఎకరా భూమి సగటున సుమారు రూ. 70 లక్షల నుంచి మొదలు కొని.. కొన్ని ప్రాంతాల్లో రూ. ఎనిమిది కోట్ల వరకు పలుకుతోంది.

ఉపాధికి అవకాశాలు

జహీరాబాద్ ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుకున్న మేరకు పరిశ్రమలు ఏర్పాటు అయితే సుమారు పది లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో యువత కోసం ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


జహీరాబాద్ పట్టణం

ఇండస్ట్రియల్ హబ్‌గా..



జహీరాబాద్ రానున్న రోజుల్లో ఇండస్ట్రియల్ హబ్‌గా మారనుంది. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిమ్జ్ అభివృద్ధి వేగంగా సాగుతోంది. కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో మాజీ మంత్రి గీతారెడ్డి ప్రత్యేక చొరవతో 2013లో నిమ్జ్ తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పనుల్లో నిర్లక్ష్యం జరిగినా, సీఎం రేవంత్‌రెడ్డి, తాను, పలువురు మంత్రులు కలిసి నిమ్జ్‌లో స్మార్ట్ సిటీ ఏర్పాటుకు కృషి చేశాం. పరిశ్రమల కోసం సాగుకు అనువుగా లేని, ప్రభుత్వ భూములే తీసుకునేలా చర్యలు చేపడుతున్నాం.

- సురేష్‌కుమార్ షెట్కార్, ఎంపీ

భూములిచ్చింది వారే.. తీసుకుంటుందీ వారే..



నియోజకవర్గంలో భూమి లేని నిరుపేదలకు భూములు ఇచ్చింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే. ఇప్పుడు తీసుకుంటుంది కూడా ఆ పార్టీ ప్రభుత్వమే. పరిశ్రమల కోసం సేకరిస్తున్న భూముల్లో ఎక్కువగా సాగుకు యోగ్యమైనవే. పరిశ్రమలు రావడం మంచిదే. ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కానీ, భూములు కోల్పోతున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. ఫార్మాసిటీతో ప్రజలు కాలుష్యం బారిన పడే ప్రమాదం ఉంది. ఫార్మాసిటీ కాకుండా ప్రత్యామ్నాయంగా కాలుష్యం లేని కర్మాగారాలను ఏర్పాటు చేయాలి.

- కొనింటి మాణిక్‌రావు, ఎమ్మెల్యే

యువతకు శిక్షణ



నియోజకవర్గంలో నిమ్జ్, స్మార్ట్ సిటీ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ఇక్కడ ఏర్పాటు అయ్యే పరిశ్రమలను దృష్టిలో పెట్టుకుని సెట్విన్, న్యాక్‌ల ఆధ్వర్యంలో పది ఎకరాల్లో 60 రకాల నైపుణ్యాలతో యువతకు శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతాం. సెట్విన్ ఆధ్వర్యంలో వివిధ రకాల కోర్సులను ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీతో అందరికీ నష్టమే. అందుకే ఫార్మాసిటీకి రెండు ఎకరాలకు బదులుగా 900 ఎకరాలకు కుదించారు. ఫార్మాసిటీ వద్దన్న అంశాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్తే, వారు సానుకూలంగా స్పందించారు.

- గిరిధర్‌రెడ్డి, సెట్విన్ చైర్మన్

అపోలో ట్యూబ్స్ పరిశ్రమ ఉద్యోగుల నిరసన


అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చేగుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్మినెంట్ ఉద్యోగులను సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ పరిశ్రమ యజమాన్యం ఉద్యోగులను ఇబ్బందుల పాలు చేస్తుందని బీఎంఎస్ జిల్లా జనరల్ సెక్రటరీ నర్సింహులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని వడియారం అపోలో ట్యూబ్స్ పరిశ్రమ ముందు ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాము గత 14 సంవత్సరాలుగా పరిశ్రమలో పర్మినెంట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నామని, యాజమాన్యం కొంతమందిని సుదూర ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. మూడు రోజులుగా పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులు పలు రకాలుగా నిరసన తెలిపినప్పటికీ, యాజమాన్యం మొండి వైఖరి అవలంబిస్తుందని విమర్శించారు. కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తూ, స్థిరపడిన ఉద్యోగులను, కార్మికులను ఒక్కసారిగా సుదూర ప్రాంతాలకు బదిలీ చేయడం అన్యాయమన్నారు. పరిశ్రమ మేనేజ్‌మెంట్ తక్షణమే బదిలీల ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని లేదంటే బీఎంఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఎంఎస్ యూనియన్ సభ్యులు కుంట రాజ్ కుమార్, చవాన్ సురేష్, సునీల్ పాస్వన్, నవీన్ యాదవ్, శ్రీనివాస్, కుమార్, పెద్ద కృష్ణ యూనియన్ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలను అమలు చేయాలి : టీపీటీఎఫ్


సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని బూరుగుపల్లి, ఇమాంబాద్, లింగారెడ్డి పల్లె, మందపల్లి, నర్సాపూర్, కేసీఆర్ నగర్, రంగధాంపల్లె, మిట్టపల్లి, బక్రీ చెప్యాల తదితర పాఠశాలల్లో సమస్యల సేకరణ, సభ్యత్వ కార్యక్రమాన్ని అర్బన్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం మాట తప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పెండింగ్ బిల్లుల కొరకు ప్రతి నెల రూ.700 కోట్లు ఇస్తామని టీజీఈజేఏసీ నాయకులకు హామీ ఇచ్చి, కేవలం రెండు నెలలు మాత్రమే చెల్లించారని తెలిపారు. గత నెలలో సుమారు రూ.200 కోట్ల విలువైన ఒక నెల జీపీఎఫ్ బిల్లులు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. దసరా సందర్భంగా ఉద్యోగులు డీఏ, హెల్త్‌కార్డ్ ప్రభుత్వం ప్రకటిస్తుందని ఆశించారని, కానీ ప్రతి నెలా ఇచ్చే రూ.700 కోట్లకు కూడా గండి పెట్టడంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. జూలై 2023 నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె. తిరుపతి, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, అనిల్ కుమార్, జిల్లా కౌన్సిలర్ మల్లేశం, భాస్కర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు తనిఖీ చేసిన కేంద్ర బృందం

పటాన్‌చెరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మదీనాగూడ నుంచి సంగారెడ్డి కూడలి వరకు రూ.800 కోట్ల అంచనా వ్యయంతో జరుగుతున్న జాతీయ రహదారి పనులను తనిఖీ చేయడానికి నేషనల్ హైవే అథారిటీ ఉన్నతస్థాయి అధికారుల బృందం పటాన్‌చెరుకు వచ్చింది. రోడ్లు భవనాల శాఖకు చెందిన అతిథిగృహంలో వారు మొక్కలు నాటారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర హైవే అథారిటీ అధికారులతో అదనపు డైరెక్టర్ జనరల్ సంజీవ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. పనులు ప్రారంభానికి ఎదురవుతున్న ఇబ్బందులను స్థానిక అధికారులు పీపీటీ ద్వారా వివరించారు. ముఖ్యంగా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సమయంలో రైతుల భూముల సేకరణ వ్యవహారాన్ని తెలిపారు. అనంతరం రోడ్డు పనుల ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మదీనాగూడ నుంచి సంగారెడ్డి కూడలి వరకు కారులోనే ఉండి రోడ్డు పనుల తీరును పరిశీలించారు. లక్డారం గ్రామ గేటు వద్ద వంతెన పనులను చూసి డీఈ రామకృష్ణను వివరాలు అడిగారు. అనంతరం అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి అధికారులతో సమావేశమయ్యారు. కేంద్ర అధికారులు కృష్ణప్రసాద్, జయభర్తి, ధర్మారెడ్డి, షరీన్ శర్మపింటు, రమేష్, సీఎస్ శాస్త్రి, కృష్ణగోయల్, వీ. రమేష్, ఏఈ ఆవుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న అదనపు డైరెక్టర్ జనరల్ సంజీవ్‌కుమార్

సంగ్రామం.. విరామం

(5వ పేజీ తరువాయి)

ప్రయాస పడడం కంటే తీర్పు వచ్చాకే అట్టహాసంగా దాఖలు చేయాలని భావించారు. చివరకు ఎన్నికలు వాయిదా పడడంతో ఆగిపోక తప్పలేదు.

మరోనెల ఉత్కంఠనే..

తాత్కాలికంగా ఎన్నికలు వాయిదా పడడంతో మరోనెల రోజుల పాటు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే రిజర్వేషన్లు ప్రకటించడంతో ఆ దిశగా ఆశావహులు ముందుకెళ్లారు. రిజర్వేషన్లు అనుకూలించని వారు నిరుత్సాహంలో మునిగారు. తాజాగా రిజర్వేషన్లపై సందిగ్ధత నెలకొనడంతో ఆశావహులు తర్జనభర్జన పడుతున్నారు. మార్పులు, చేర్పులు ఉంటాయనే కోణంలో ఆశలు పెట్టుకున్నారు. 42 శాతం బీసీలకు దక్కకుంటే తమకు లాభిస్తుందని ఓసీ కేటగిరి ఆశావహులు భావిస్తున్నారు. మండలం, జిల్లా యూనిట్‌గా రిజర్వేషన్లు మారుతాయని చర్చ జరుగుతుండడంతో మళ్లీ అందరూ తెరపైకి వచ్చారు. వచ్చే నెలరోజుల పాటు ఊపిరిబిగపట్టడం తప్ప చేసేదేమీ లేదని ఆశావహులు చెబుతున్నారు.

ధాన్యం కొనుగోలుకు స్థలం కేటాయించాలి

● బైక్ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతి

రామాయంపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు స్థలం కేటాయించాలని రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు గురువారం యువకులు, ప్రజలు సుమారు 350 మంది బైక్ ర్యాలీగా రామాయంపేట తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చి వినతిపత్రం అందించారు. తాము పండించిన ధాన్యం ఎక్కడ ఆరబెట్టాలో, ఎక్కడ అమ్మాలో తెలియక ఈ ఆందోళనకు సిద్ధమయ్యామని గ్రామస్థులు తెలిపారు. ఒకవైపు పోలీసులు రోడ్లపై వరి ధాన్యం ఆరబోయొద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు, మరోవైపు ఇందుకు కావాల్సిన స్థలం లేదు. పంటను ఎక్కడ విక్రయించాలి? ఎక్కడ ఆరబెట్టాలి? మీరే చెప్పాలంటూ తహసీల్దార్ రజనీకి విన్నవించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాయిలాపూర్ గ్రామస్థులు

రిటైర్మెంట్ బకాయిలు ఎప్పుడు ఇస్తారు?

● సర్కారు స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం
● రేవా కమిటీ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన

సిద్దిపేట క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): 18 నెలలు గడిచినా రిటైర్మెంట్ బకాయిలు రాకపోవడంతో రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రేవా (రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) ఆందోళన వ్యక్తం చేసింది. గురువారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో జరిగిన సిద్దిపేట జిల్లా రేవా సమావేశానికి పోనమల్ల రాములు అధ్యక్షత వహించారు. గత సంవత్సరం మార్చిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు జీపీఎఫ్, జీఐఎస్, ఈఎల్ఎస్, కమిటేషన్, గ్రాట్యూటీ మొదలైన బకాయిలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ బకాయిలు రాక కొందరు గుండె పగిలి మరణించారని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చట్టబద్ధంగా స్పందించి బకాయిలు విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం డీఏ ఇవ్వడం లేదని, పీఆర్‌సీ అమలు చేయడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా రేవా కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పోనమల రాములు, సెక్రటరీగా ఎండీ సలీం, కోశాధికారిగా రాజిరెడ్డి, పీఆర్‌ఓగా విష్ణు, సలహాదారులుగా జయ సింహారెడ్డి, వీడీగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

విద్యార్థి మృతిపై విచారణ..

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమశాఖ (బాలుర) గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి వివేక్ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటనపై గురువారం గురుకులాల సొసైటీ డిప్యూటీ కార్యదర్శి సహజ విచారణ చేపట్టినట్లు తెలిసింది. పాఠశాల వేళల్లో ఎవరెవరున్నారు, విద్యార్థి వివేక్ ఏ విధంగా మృతి చెందాడనే అంశాలపై ఉపాధ్యాయులు, పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి మృతిపట్ల ఆమె విచారం వ్యక్తం చేశారని సమాచారం. అలాగే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల నిర్వహణ, పెండింగ్ బిల్లుల వంటి అంశాలపై ఆమె ఉమ్మడి కరీంనగర్ జిల్లాల ప్రిన్సిపాళ్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల విధివిధానాలు, హాజరు, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, వసతి సౌకర్యాలు, మెనూ ప్రకారం భోజనం వంటి వాటిపై చర్చించినట్లు సమాచారం. హుస్నాబాద్‌లో జరిగిన సంఘటన పునరావృతం కాకుండా పటిష్ఠ బాధ్యతతో వ్యవహరించాలని సూచించినట్లు తెలిసింది.

దొంగతనం కేసులో ఒకరి అరెస్టు

● 4 తులాల బంగారు పుస్తెలతాడు స్వాధీనం

దుబ్బాక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట గ్రామంలో గత రెండు రోజుల క్రితం మహిళపై దాడి చేసి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు అపహరించిన సంఘటనలో గురువారం నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపారు. దుబ్బాక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన జూకంటి మల్లారెడ్డి గ్రామంలోని కంకణాల రాజమణి(75)ని నమ్మించి ఇంట్లో చొరబడ్డాడు. అనంతరం అక్కడే తక్కెడ బరువుతో రాజమణిని గాయపరిచి ఆమె మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడును అపహరించాడు. బాధితురాలి భర్త కంకణాల శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి కోసం గాలించి, గురువారం ఉదయం పోతారెడ్డిపేట శివారులో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దాడికి ఉపయోగించిన తక్కెడ బరువుతో పాటు నాలుగు తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై హత్యాయత్నం, దొంగతనం కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐతో పాటు సిబ్బంది రాంజీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో కుంగిన పైప్‌లైన్

● ప్రమాదానికి ఆస్కారం


రోడ్డుపై కుంగిన పైప్‌లైన్

మనోహరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం జాతీయ రహదారి పక్కనే దండుపల్లి నుంచి వర్గల్ మండలం వరకు రెండు లేన్ల రోడ్డుపై ఉన్న పైప్‌లైన్ కుంగింది. ఈ రోడ్డుకు రెండు వైపులా దండుపల్లి గ్రామ పెద్ద చెరువు నీరు నిండి ఉంది. ఈ నేపథ్యంలో రోడ్డు కింద భాగంలో నీటి కోసం పైపులను ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ పగిలిపోవడంతో రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. దీంతో రోడ్డు మధ్యలో తెగిపోయే ప్రమాదం ఉండడంతో ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగముందే ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

గుంతలమయంగా రోడ్లు

- అవస్థల ప్రయాణం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


చిత్తడిగా మారిన ఘనపూర్‌కు వెళ్లే రహదారి


తొగుట - లింగంపేట రహదారి దుస్థితి

తొగుట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తొగుట మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేకపోడంతో ప్రతి ఒక్కరూ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించడం పరిపాటిగా మారింది. దాంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై ఎక్కడపడితే అక్కడ పెద్దగుంతలు ఏర్పడి అందులో నీరు చేరి ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాహనదారులు, బాటసారులు ఆ రోడ్ల వెంబడి ప్రయాణించడానికి జంకుతున్నారు. గ్రామాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. తొగుటలోని విద్యుత్ ఏఈ కార్యాలయం మీదుగా లింగంపేట వెళ్లే రహదారి బురదమయంగా మారి అధ్వాన్నంగా తయారయ్యింది. అదే విధంగా తుక్కాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఘనపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు ప్రయాణం సర్కస్ ఫీట్లను తలపిస్తుంది. రోడ్డుపై గోతులు పెద్దగా ఏర్పడి నీరు నిల్వ ఉండటంతో తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాటు కాన్గల్ గ్రామానికి వెళ్లే తారు రోడ్డు మొత్తం చెడిపోయి మట్టిరోడ్డుగా మారి గుంతలు పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలరోడ్లకు మరమ్మతులు చేయించి ప్రమాదాలు చోటు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బురద రోడ్డుపై నడవాలంటేనే ఇబ్బందిగా ఉంది



రోడ్డుపై నడవాలంటే ఇబ్బందిగా ఉంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. తరచూ బురదలోపడి ప్రమాదాలు చోటు జరుగుతున్నాయి. అధికారులు గుంతలలో కనీసం తట్టెడు మట్టికూడ పోపిస్తలేరు. ఇట్లాఐతే ఎలా నడిచేది. తొందరగా రోడ్డు పనులు బాగు చేపించాలి.

\- వెంకట్రాం బాల్‌రెడ్డి, గ్రామస్థుడు (తొగుట)

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సిద్దిపేటను మొదటి స్థానంలో నిలుపుదాం

- మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ -2025లో దేశంలోనే సిద్దిపేటను మొదటి స్థానంలో నిలుపుదామని, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని టౌన్ హాల్‌లో నిర్వహించిన పట్టణ మహిళ సమాఖ్య సమావేశంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ హజరై మాట్లాడుతూ.. మెప్మా అంటేనే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అని, పట్టణంలో పేదరికం అనేది లేకుండా చేయడం ముఖ్య ఉద్దేశమన్నారు. పట్టణంలో పేదరికతను తగ్గించడంలో ఉన్న మెప్మా విధి నిర్వహణతో పాటు పట్టణ పరిశుభ్రత కూడా మన బాధ్యతని గుర్తుచేశారు. మహిళా సంఘాల సభ్యులు ప్రతిరోజూ ఉదయాన్నే వార్డులలో చెత్త సేకరణ వాహనం వెంట వెళ్లి, అట్టి సమయంలో చెత్త ఇవ్వని వారి వివరాలు గుర్తించాలని, బహిరంగ ప్రాంతాలలో ఎవరు కూడా చెత్త వేయకుండా చూడాలని సూచించారు. బహిరంగ ప్రాంతాలలో చెత్త వేయటం వలన బ్లాక్ స్పాట్ ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అందరి సహకారంతో సిద్దిపేట పట్టణంలో బ్లాక్ స్పాట్‌లను నిర్మూలిద్దామన్నారు. ఈ సమావేశంలో అధికారులు హన్మంతరెడ్డి, విద్యాసాగర్, సీవోలు రేణుక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పొన్నాల కుమార్‌కు ఎమ్మార్పీఎస్‌కు సంబంధం లేదు

గజ్వేల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్‌కు పొన్నాల కుమార్‌కు ఎటువంటి సంబంధం లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకటించారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ 30సంవత్సరాల చరిత్ర గల ఎమ్మార్పీఎస్, దళిత, బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం, సంక్షేమం కోసం, ఆత్మగౌరవం కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. రాజకీయ, స్వార్థ, వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఎమ్మార్పీఎస్‌ను కొంతమంది వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. సోషల్‌మీడియాలో, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడిగా పొన్నాల కుమార్ ప్రకటనలు చేస్తున్నారని, ఆయనకు ఎమ్మార్పీఎస్‌కు సంబంధం లేదని తెలిపారు.

లారీని ఢీకొన్న బస్సు

- ముగ్గురికి తీవ్ర, ఏడుగురికి స్వల్ప గాయాలు

కుకునూర్‌పల్లి,అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి):కుకునూర్‌పల్లి మండలకేంద్రానికి సమీపంలోని ఆర్‌వోబీపై గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు లారీని ఢీకొట్టడంతో ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు కోరుట్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో గాయపడ్డ డ్రైవర్‌ను, ప్రయాణికులను 108 సిబ్బంది గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బీసీ బాలుర పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

కొండపాక అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండపాకలోని ఉప్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ హైమావతి గురువారం రాత్రి తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లను పరిశీలించారు కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. స్టోర్ రూమ్‌లో కూరగాయలను సరుకులను తనిఖీ చేస్తూ వంట గది ఎల్లప్పుడూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎప్పుడూ డ్రైగా ఉండే విధంగా చూసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు.


కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎన్నికల పరిశీలకుడిని కలిసిన కలెక్టర్

కొండపాక లోని ఎచ్ఎండీఏ వసతి గృహంలో స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె. చంద్రశేఖర్ రెడ్డిని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ గురించి కాసేపు చర్చించారు.

విద్యార్థులు మానసికంగా పరిణతి చెందాలి

గజ్వేల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు భౌతికంగా పరిణితి చెందుతూనే మానసికంగా పరిణితి చెందాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజూమ్ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్ఎస్ఎస్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు మానసిక పరిణతిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు భౌతికంగా, మానసికంగా పరిణితి చెందాలని, అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ విషయ నిపుణులు డాక్టర్ కుమారస్వామి, మరో నిపుణులు మురళీ మాట్లాడుతూ... విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమించి సామాజిక మాధ్యమాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మిరుదొడ్డి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో గురువారం ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం నర్సమ్మ ప్రారంభించారు. మిరుదొడ్డి మండలం ధర్మారం, అందె, లక్ష్మీనగర్, అల్వాల్, మల్లుపల్లి,లింగుపల్లి, కొండాపూర్‌తోపాటు అక్బర్‌పేట-భూంపల్లి మండలం జంగపల్లి, అల్మాస్‌పూర్, వీరారెడ్డిపల్లి, కూడవెల్లి, బేగంపేట, రుద్రారం, అక్బర్‌పేటలో ఐకేపిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.


ధర్మారంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సిబ్బంది

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక


అంజిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ యువకులు

ములుగు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చకే యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. గురువారం ములుగులోని పలు పార్టీలకు చెందిన యువకులు అంజిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చకపోవడం వల్ల యువత కాంగ్రెస్ ప్రభుత్వంపై విరక్తి చంది స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

మండల కేంద్రమైన ములుగు గ్రామానికి చెందిన ఆరే బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఉదయం ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ హరిబాబు, మాజీ ఉపసర్పంచ్ దండే కరుణాకర్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్, కనకయ్య, నాగేష్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

అపరిచితుల మాటలు నమ్మి మోసపోవద్దు

చిన్నకోడూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్సై విజయభాస్కర్ సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సిద్దిపేట షీటీమ్ బృందం సభ్యులతో కలిసి విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, ఈవిటీజింగ్, గుడ్, బాడ్ టచ్, రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ట్రాఫిక్ ఎస్సై విజయభాస్కర్ మాట్లాడారు. మానవ తప్పిదం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. అవసరం మేరకు మాత్రమే సోషల్ మీడియాను ఉపయోగించాలని తెలిపారు. చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావివ్వకూడదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దని సూచించారు.



విద్యార్థులతో సిద్దిపేట ట్రాఫిక్ ఎస్సై విజయభాస్కర్, సిద్దిపేట షీటీం బృందం సభ్యులు

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- అదనపు డీఆర్‌డీవో సుధీర్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అవకాశాల కోసం ఎదురు చూడకుండా, అవకాశాలను సృష్టించుకునేలా ఆలోచన విధానం మారాలని అదనపు డీఆర్‌డివో సుధీర్ సూచించారు. మనకు వచ్చే ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని చెప్పారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (యూజీఆర్ఎస్‌టీఐ) ఆధ్వర్యంలో చేపట్టిన పుట్టగొడుగుల పెంపకం, బ్యూటీపార్లర్ మెనేజ్‌మెంట్ ఉచిత శిక్షణ తరగతుల సందర్భంగా నిర్వహించిన ప్రారంభ సమావేశానికి అదనపు డీఆర్‌డీవో సుధీర్ ముఖ్య అతిథిగా హజరై శిక్షణార్థులనుద్దేశించి మాట్లాడారు. మనం ఆలోచించే విధానం పాజిటివ్‌గా ఉండాలని నెగిటివిటీని దగ్గరకు రానీయవద్దన్నారు. లక్ష్యం గొప్పగా ఉండాలని, అందుకు తగ్గట్టుగానే ప్రణాళికబద్ధంగా పనిచేయాలని చెప్పారు. అంతకుముందు సంస్థ డైరెక్టర్ గేము నాయక్ మాట్లాడుతూ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని మంచి ఆర్థిక స్థితిలో ఉండాలన్నారు.

బీసీలను మోసం చేయడానికే సర్కారు కుట్ర

- తెలంగాణ బీసీ గర్జన కన్వీనర్ అబ్బుల రాజలింగంగౌడ్

దుబ్బాక, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): బీసీల న్యాయమైన పోరాటానికి దారులు మూసేసే కుట్రలో భాగమే జీవో 9 అని తెలంగాణ బీసీ గర్జన కన్వీనర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అబ్బుల రాజలింగంగౌడ్ అన్నారు. గురువారం హైకోర్టు తీర్పుపై ఆయన స్పందించారు. బీసీలపై ప్రేమను చూపినట్టే చూపి రెంటికి చెడ్డరేవడిగా చేశారని ఆయన మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, న్యాయబద్ధమైన పోరాటం చేసి, పార్లమెంటు ద్వారా సాధించుకునేవారమని, ఆయన కేవలం ద్వంద్వవైఖరితో డ్రామాలాడి, బీసీల నోట్లో మట్టిపోశారన్నారు. ఈ ఉదాంతంలో బీసీలు పావులుగా మారితే, దేశవ్యాప్తంగా బీసీ నినాదంను ఎత్తుకున్న రాహుల్‌గాంధీని పిచ్చోడిని చేసి, బీసీ నినాదం పక్కకు నెట్టే కుట్రలో భాగమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలను దేశప్రజలు గమనించాలని, తెలంగాణ బీసీ సమాజం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయాలన్నారు. కోర్టులో తమ వాదనలు వినిపించడంలో విఫలమయ్యారంటేనే, ప్రభుత్వం సరైన వాదనలు వినిపించలేదనేది సుస్పటమని, దీనికి రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

- బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖమ్మం వెంకటేశం

కోహెడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చాటుతుందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఖమ్మం వెంకటేశం ధీమా వ్యక్తం చేశారు. గురువారం కోహెడ కేంద్రంలో పార్టీ మండల స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు జాలిగాం రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించుకొని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి బహుమతిగా అందించాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకునేలా ముందుకు సాగుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాకల రజినీకాంత్ రెడ్డి, బినవేణి లక్ష్మణ్, మాజీ ప్రజా ప్రతినిధులు మండల, గ్రామ బూత్ స్థాయి నాయకులు తదితరులు ఉన్నారు.

వైద్యులపై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

హుస్నాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7వ తేదీన హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులపై దాడికి పాల్పడి విధులకు ఆటంకపరచిన చిట్టంపల్లి సురేష్ అనే వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. డ్యూటీలో ఉన్న వైద్యులతో పాటు సిబ్బందిని దూషిస్తూ అసభ్యంగా ప్రవర్తించి, డాక్టర్ల ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేశాడని ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకపరచినా, భౌతిక దాడులకు పాల్పడిన చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

స్థానిక సంస్థల గెలుపుతోనే కాన్షీరాంకు నిజమైన నివాళి

సిద్దిపేట క్రైం అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్, బీఆరెస్ పార్టీలు బహుజనులను మోసం చేస్తు రాజకీయ పబ్బం గడుపుతున్నాయని రాష్ట్ర నాయకుడు కదాసి రవీందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో బహుజన రాజకీయ పితామహుడు బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్షిరం వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి బీఎస్పీ రాష్ట్ర నాయకులు కదాసి రవీందర్ నివాళ్ళు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు కదాసి రవీందర్ మాట్లాడుతూ బీసీ ల 42 శాతం రిజర్వేషన్ల మీద ఈ ఆధిపత్య కుల పార్టీలు కలిసి నాటకం ఆడుతున్నాయని వాటికి సరైన గుణపాఠం చెప్పాలంటే స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో బీఎస్పీ నాయకులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి గజ్జెల తిరుపతి మౌర్య జిల్లా ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ పక్కనే కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లు ప్రత్యక్షం

మద్దూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు గత నెల 27న ఎత్తుకెళ్లిన 9 కంప్యూటర్లు, 3 కంప్యూటర్ సిస్టమ్‌తో పాటు కీబోర్డులు, మౌస్‌లు, మూడు మానిటర్లు గురువారం కాంపౌండ్ వాల్ పక్కన ప్రత్యక్షమయ్యాయి. అటుగా వెళ్లి ఓ రైతు కంటపడటంతో సమాచారం అందుకున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం మోడల్‌స్కూల్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు చేర్యాల సీఐ ఎల్. శ్రీను స్థానిక ఎస్సై షేక్ మహబూబ్ అలీతో కలిసి మోడల్ స్కూల్‌ను సందర్శించి వదిలేసి వెళ్లిన 8 ల్యాప్‌టాప్‌లు, 2 కంప్యూటర్ సిస్టమ్స్‌తో పాటు 2 మానిటర్లు, కీ బోర్డులు, మౌస్‌లను పరిశీలించి ఉపాధ్యాయులు సమక్షంలో పంచనామా రాసుకుని స్వాధీనం చేసుకున్నారు. చోరీ ఘటన రోజు నుంచి పోలీసులు సీసీ పుటేజీలతో పాటు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఇటీవల రెండు రోజుల క్రితం మోడల్‌స్కూల్‌లోని విద్యార్థులను చోరీ ఘటనపై ప్రశ్నించి వివరాలు రాబట్టే ప్రయత్నం చేయడంతో పాటు ఒక వేళ చోరి చేసినట్లు తేలితే కేసులు నమోదవడంతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవనున్నట్లు తమదైన శైలిలో ప్రశ్నించినట్లు సమాచారం. కాగా బుధవారం రాత్రి మోడల్‌స్కూల్లో ఏపీసీ ఆదేశాలకు మేరకు పోలీసులు గత నెల 21 నుంచి సీసీ పుటేజీలను పరిశీలించారు. గురువారం ఉదయం మాడల్‌స్కూల్ పక్కనే ఓ రైతు తన వ్యవసాయపొలం వద్దకు వెళ్లి తిరిగి మోడల్ స్కూల్ పక్క నుంచి వస్తున్న క్రమంలో స్కూల్ పక్కనే ట్యాప్‌టాప్‌లు, సిస్టమ్స్‌తో పాటు రెండు మానిటర్లు, కీబోర్డులు, మౌస్‌లు పడేసి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పత్తిచేనులో కీబోర్డులు, కాంపౌండ్ పక్కనే ట్యాప్‌టాప్‌లు ప్రత్యక్షమవుతూ పోలీసులకు సవాల్‌గా మారింది. త్వరలోనే చోరికి పాల్పడిన వారిని పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



వెంకట్రాం రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

జగదేవపూర్: అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత పీఆర్‌టీయూటీఎస్ జగదేవపూర్ మండల అధ్యకుడు చిలుకూరి వెంకట్రాం రెడికి గురువారం సన్మానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధరాసుపల్లి శశిధర్ శర్మ, మండల ప్రధాన కార్యదర్శి బొద్దునాయక్, నాయకులు రామకృష్ణారెడ్డి, నరేందర్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, రఘురాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింహా రెడ్డి, మహిళా ఉపాధ్యక్షులు సంధ్యాకుమారి, పిఎస్ గొల్లపల్లి ప్రధానోపాధ్యాయులు జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి,నాగరాజు, నర్సింలు, శ్రీనివాస్, వాణి, మేనక, విజయలక్ష్మి, శ్రీనివాస్ ,విమల,రజిత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థిక స్వావలంబన పొందేందుకు బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఎనలేని కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బాల వికాస సంస్థ ఏర్పాటు చేసిన మహిళా వికాస సంఘం వార్షిక మహాసభలో మాట్లాడారు. బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నదని వెల్లడించారు. మహిళలు, వృద్ధులు, అనాధలు, వితంతువులకు సంస్థ ద్వారా చేయూతను అందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో కూడా సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, బాలవికాస సంస్థ ప్రతినిధి లత తదితరులున్నారు.

ఏటీసీ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

కుకునూర్‌పల్లి/దుబ్బాక, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలోని ఐటీఐ కళాశాల అవరణలోని అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్‌ను గురువారం జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ (స్థానిక సంస్థలు) సందర్శించారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఉపాధి శిక్షణ తరగతులను పరిశీలించారు. ఏటీసీ ద్వారా విద్యార్థులల్లో అదునాతనమైన నైపుణ్యాన్ని అందించాలని, మంచి శిక్షణ ద్వారా వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేలా తీర్చిదిద్దాలని సూచించారు. కళాశాల్లో శిక్షణను అందించే అధునాతనమైన యంత్రాలు, పరికరాల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కళాశాలల్లో శిక్షణ ఎలా ఇస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు.

కుకునూర్‌పల్లిలో


కుకునూర్‌పల్లి ఏటీసీలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కుకునూర్‌పల్లి మండలకేంద్రంలోని శివారులో కొత్తగా నిర్మించిన ఏటీసీలో పెండింగ్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకొని త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు.

పోచమ్మ, ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి భూమి పూజ

ములుగు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ములుగు ఎస్సీ కాలనీలో పోచమ్మ, ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి గురువారం ఉదయం కుల కుటుంబ సభ్యులకు కలిసి వేద పండితులతో భూమి పూజ చేశారు. గుడి నిర్మాణంలో అందరూ కలిసికట్టుగా ఉండి నిర్మాణం తొందరగా పూర్తి చేసుకోవాలని కమిటీ సభ్యులు తీర్మానం చేసుకున్నారు.

గులాబీ జెండా ఎగురవేయాలి

హుస్నాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గులాబి జెండా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రణాళికబద్దంగా, సమన్వయంతో పని చేసి అన్ని స్థానాల్లో విజయం సాధించాలని సూచించారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి


ప్రభుత్వాసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో పేదప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీను డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడంలో విఫలమౌతున్నారని, నిర్లక్ష్యపూరిత వైద్యాన్ని అందిస్తున్నారని మండిపడుతూ జిల్లా ఆసుపత్రి అత్యవసర విభాగం ఎదుట ధర్నాకు దిగారు. అనంతరం సూపరిండెంట్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్ఎంవో శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో రోజుకు 30డెలీవరీలు జరిగేవని, ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ప్రతి చిన్న విషయానికి వైద్య పరీక్షలు చేయాలంటూ ప్రైవేట్ ల్యాబులకు రోగులను పంపిస్తున్నారని, ఏ చిన్న విషయానికైనా ఆయా వంకలు పెట్టి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని రిఫర్ చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే అధికారులు మారకుంటే ఈ విషయాన్ని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోద ర రాజనర్సింహ వరకు తీసుకువెళ్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో వారివెంట మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు నత్తి శివకుమార్, రాంచంద్రాచారీ, నర్సింహచారీ, నాయిని సందీప్‌కుమార్, తదితరులున్నారు.

లైసెన్స్ తుపాకులు పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలి

- సీపీ విజయ్ కుమార్

సిద్దిపేట క్రైం అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించాలని సీపీ విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ లోపు డిపాజిట్ చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తిరిగి నిబంధనల ప్రకారం తీసుకొని వెళ్లవచ్చని తెలిపారు. తుపాకులు డిపాజిట్ చేయని వారిపై రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారదర్శకంగా విష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ గురించి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రజలు ప్రజా ప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. జిల్లాలో బార్డర్ పోలీస్ స్టేషన్లలో ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందని, 24 గంటలు వాహనాలు తనిఖీ నిర్వహిస్తామన్నారు.